# లేబర్ కోడ్‌ల రద్దుకై ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మె



ఇది కద నిజం,రాజేంద్రనగర్: కేంద్ర ప్రభుత్వం కార్మికులకు మరణశాసనంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, ఫిబ్రవరి 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కోశాధికారి కన్యగారి నర్సింహ్మారెడ్డి పిలుపునిచ్చారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్మికుడిపై ఉందని ఆయన పేర్కొన్నారు. సమ్మె సన్నాహకాల్లో భాగంగా రాజేంద్రనగర్ లేబర్ అడ్డాలో కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ.. పారిశ్రామిక ప్రాంతాల్లోని కార్మికులందరూ ఏకమై ఈ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వానికి బుద్ధి చెప్పే వరకు మన పోరాటం ఆగదని, నాలుగు లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకు ఐక్యంగా పోరాడాలని ఆయన ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మండల ఏఐటీయూసీ మరియు కార్మిక సంఘం నాయకులు జి. సత్యం, సలీం, సాబీర్, వాణి, మునేశ్వరి, దేవేందర్, శంకర్, గోవింద్ తదితరులు పాల్గొని తమ మద్దతును తెలిపారు. కార్మికుల హక్కుల రక్షణ కోసం అందరూ స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొనాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

# ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

## ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు రాష్ట్ర నాయకులు పుస్తకాల నర్సింగ్ రావు



ఇది కద నిజం: ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలి అని పుస్తకాలు నర్సింగ్ రావు కార్మికులకు పిలుపునిచ్చారు

ఈరోజు సిపిఐ రాజేంద్రనగర్ కార్యాలయం ఏ ఆర్ దేవరాజ్ భవన్ లో జరిగిన గోడ పత్రికను విడుదల చేసి ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను అలాగే వ్యవసాయ సంస్కరణల నల్ల.చట్టాలను విద్యుత్తు చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12న అఖిలభారత కార్మిక సంఘాలు వ్యవసాయ రైతు సంఘాలు సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని ఈ సమ్మెలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ఆయన తెలిపారు

నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తూ పేద ప్రజల మీద జిఎస్టి పేరుతో పన్నుల భారాన్ని మోపుతున్నదని ఆయన విమర్శించారు

ఏఐటియుసి భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కోశాధికారి మరియు జిల్లా కార్యవర్గ సభ్యులు కన్యగారి నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో ఉన్న పరిశ్రమలలో ఎలాంటి కార్మిక చట్టాలు అమలు కావడం లేదని ఆయన అన్నారు వలస కార్మికులను తెచ్చి పనిలో పెట్టుకొని ఎలాంటి కార్మిక చట్టాలను అమలు చేయకుండా ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్న పరిశ్రమ యాజమాన్యాల పైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు సార్వత్రిక సమ్మె సందర్భంగా అన్ని పారిశ్రామిక వాడలలో సభలు సమావేశాలు నిర్వహించి పారిశ్రామిక కార్మికులను చైతన్యం చేయాలని ఆయన కార్యకర్తలకు సూచించారు ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మరియు జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంఏ రియాజ్ జిల్లా సమితి సభ్యులు ఆనంద్ గౌడ్ మండల పార్టీ సహాయ కార్యదర్శి జె విజయానంద్ గౌడ్ ఏఐటీయూసీ నాయకులు జి సత్యం సదానంద గౌడ్ సలీం సాబీర్ రామచందర్ మునేశ్వరి ఊర్మిళ జ్యోతి బుజ్జి గంగారం హుస్సేన్ భాయ్ ఆంజనేయులు కొండయ్య మధు కార్యక్రమంలో పాల్గొన్న మండల నాయకత్వం.

# ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన పద్మారావు గౌడ్



ఇది కద నిజం:నామాలగుండు లో ఉచిత వైద్య శిబిరాన్ని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు వైద్య సేవలను అందిబాటు లోకి తేవడంలో ప్రతి ఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ సామల హేమ, ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ దివ్య భండారి, సన్ రైజ్ డయాగ్నొస్టిక్ నిర్వాహకుడు జగన్, సుంకు రామచందర్, వైద్య నిపుణులు, నాయకులు పాల్గొన్నారు.

# గణనీయంగా పెరిగిన బోర్‌వెల్ మెటీరియల్ ధరలు

## పెరిగిన వ్యయభారంతో డ్రిల్లింగ్, ఫిట్టింగ్ చార్జీల పెంపు అనివార్యం



నెల్లూరు జిల్లా పొదలకూరు (ఇది కద నిజం):- గతంలో ఎన్నడూ లేని విధంగా బోర్‌వెల్ డ్రిల్లింగ్‌కు ఉపయోగించే మెటీరియల్ ధరలు గణనీయంగా పెరగడంతో బోర్‌వెల్ యజమానులు, ఏజెంట్లు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా డ్రిల్లింగ్ బిట్ల ధరలు మూడింతలుగా పెరగడం వల్ల బోర్‌వెల్స్ నిర్వహణ వ్యయం అమాంతం పెరిగిందని పొదలకూరు బోర్‌వెల్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. 6.5.ఇంచుల డ్రిల్లింగ్ బిట్లు గతంలో రూ.22 వేల వరకు ఉండగా ప్రస్తుతం అవి రూ.62 వేల వరకు చేరాయని, అలాగే ఓబీ బిట్లు రూ.15 వేల నుంచి రూ.35 వేల వరకు పెరిగాయని వారు వివరించారు. ఈ పరిస్థితుల్లో బోర్‌వెల్స్ మెటీరియల్ కాస్ట్ గణనీయంగా పెరిగిందని, దీనికి అనుగుణంగానే డ్రిల్లింగ్, ఫిట్టింగ్ చార్జీలు వినియోగదారులు, రైతులకు తప్పనిసరిగా పెరగాల్సి వస్తోందని అసోసియేషన్ సభ్యులు కోవూరు బక్కయ్య నాయుడు, చొప్ప వెంకటేశ్వర్లు, మల్లినేని వెంకటేష్, మాదినేని రవి, దాసినేని ప్రసాద్, మాదినేని శంకరయ్య, కొమ్మి వేణు తెలిపారు.ఆదివారం స్థానిక ద్వారకామాయి కళ్యాణ మండపంలో వెంకటగిరి, గూడూరు, రాపూరు ప్రాంతాలకు చెందిన బోర్ వేల్స్ యజమానులు సమావేశం నిర్వహించారు

# పోలింగ్ సందర్భంగా ప్రచార కార్యక్రమాలపై నిషేధం




నిజామాబాద్, ఫిబ్రవరి 08 : మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని అనుసరిస్తూ జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, భీంగల్ పట్టణాలలో ఈ నెల 09వ తేదీ సాయంత్రం 5.00 గంటల నుండి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులోకి వస్తుందని, ఎన్నికలు ముగిసేంత వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో పై పట్టణాలలో ఎవరు కూడా బహిరంగ ఎన్నికల ప్రచారం చేయరాదని అన్నారు. ఎఫ్.ఎస్.టి, ఎస్.ఎస్.టి, ఎం.సి.సి బృందాలు, పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. కాగా, మున్సిపల్ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా ఈ నెల 9వ తేదీ సోమవారం సాయంత్రం 5.00 గంటల నుండి 11వ తేదీ పోలింగ్ ముగిసేంత వరకు మద్యం షాపులను, కల్లు దుకాణాలను మూసివేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను పురస్కరించుకుని ఈ నెల 13న కూడా మద్యం, కల్లు దుకాణాలు మూసివేయాలని, కౌంటింగ్ ముగిసేంత వరకు డ్రై డే అమలు లో ఉంటుందని తెలిపారు.

# పెంచలకోనలో వైభవంగా స్వాతి నక్షత్ర వేడుకలు

## కనుల పండువగా బంగారు గరుడ సేవ!“



నెల్లూరు జిల్లా రాపూరు (ఇది కద నిజం): ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన రాపూరు మండలం లోని పెంచలకోనలో.. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి జన్మ నక్షత్రమైన 'స్వాతి' పర్వదినం అత్యంత వైభవంగా జరిగింది. స్వామివారికి అత్యంత ప్రీతికరమైన ఈ రోజున.. ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ లోకకళ్యాణార్థం విశేష హోమాలు, యాగాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం నుంచే స్వామివారికి పంచామృతాభిషేకాలు, విశేష పుష్పాలంకరణలతో పూజలు జరిగాయి.

ఇక ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన 'బంగారు గరుడ వాహన సేవ' నేత్రపర్వంగా సాగింది. సర్వాలంకార భూషితుడైన శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహుడు.. తన ప్రియ భక్తుడైన గరుత్మంతునిపై (బంగారు గరుడ వాహనంపై) ఆశీనులై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ మాడ వీధుల్లో మేళతాళాలతో స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. గోవింద నామస్మరణతో పెంచలకోన మార్మోగింది. స్వామివారి గరుడ సేవను తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

# నేటి నుంచి శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు..!




శ్రీశైలం,ఇది కద నిజం: నంద్యాల జిల్లా శ్రీశైలం మహా క్షేత్రంలో ఈ రోజు నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.బ్రహ్మోత్సవాలకు సుమారు 12 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది కంటే అదనంగా ఏర్పాట్లు చేశారు.

ఈరోజు 8 నుండి 12న సాయంత్రం 7 గంటల వరకు మాత్రమే శివదీక్ష ఇరుముడి కలిగిన స్వాములకు మాత్రమే శ్రీమల్లికార్జునస్వామి స్పర్శ దర్శనం విడతల వారీగా ఏర్పాటు చేశారు..!

బ్రహ్మోత్సవాలకు నలభై లక్షల లడ్డూలను అందుబాటులో ఉంచుతామన్నారు.

క్షేత్రంలో పలుచోట్ల వాహనాల పార్కింగ్ సేద తీరేందుకు జర్మన్ షెడ్లు, పార్కింగ్ లో మంచినీరు, మరుగుదొడ్లు, లైటింగ్ అందుబాటులో ఉంచారు.

పోయిన ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా బ్రహ్మోత్సవాల సందర్భంగా ఫిబ్రవరి 13 నుండి 16 వరకు నాలుగు రోజులు భక్తులకు ఉచిత లడ్డు అలాగే 15, 16 రెండు రోజులు వాహనాలు టోల్ గేట్లు లేకుండా ఉచితంగా అనుమతించనున్నారు.

పాదయాత్రగా అటవీ మార్గంలో వచ్చే భక్తులకు భీముని కొలను కైలాసద్వారం నుండి పలుచోట్ల స్వచ్ఛంద సంస్థలచే అన్నదానం, మెడికల్ క్యాంపులు, మంచినీరు,సేద తీరేందుకు షెడ్లు నిర్మించారు .

